బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 23 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## దోపిడీ దొంగల బీభత్సం


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బైక్ వెళ్తున్న వ్యక్తిని కారుతో ఢీ కొట్టి అతని మెడలో ఉన్న గొలుసులు దోపిడీ దొంగలు లాక్కొని వెళ్లిన ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మిగూడ ప్రాంతానికి చెందిన నాగరాజు ఉదయం బైక్‌పై లక్ష్మిగూడ ప్రధాన రహదారిపై వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన కారు అతన్ని ఢీకొట్టింది. దాంతో నాగరాజు బైక్‌పై నుంచి కింద పడ్డాడు. వెంటనే కారులో ఉన్న వ్యక్తులు నాగరాజు మెడలోని బంగారు గొలుసులు లాక్కొని కారులో అక్కడి నుంచి వెళ్లిపోయారు. హఠాత్తుగా జరిగిన ఈ ఘటనతో నాగరాజు తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. వెంటనే స్థానికుల సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలను క్షుణంగా పరిశీలించారు. దొంగలు టీఎస్07జేజీ5783 అనే నెంబర్ కారులో వచ్చారని ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. దోపిడీ దొంగల కోసం గాలిస్తున్నారు.

### భారత్-న్యూజిలాండ్ మధ్య

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

**9 నెలల్లోనే ట్రేడ్ డీల్ పూర్తి.. వాణిజ్యం, పెట్టుబడులకు కొత్త ఊపు**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్తో టెలిఫోన్ సంభాషణ జరిపారు. ఈ సందర్భంగా ఇరుదేశాల నాయకులు సంయుక్తంగా భారత్%-%న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. ఈ డీల్ ద్వారా రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, భాగస్వామ్య అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు.

**తొమ్మిది నెలల్లోనే ట్రేడ్ డీల్**

2025 మార్చిలో న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ భారత్ పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు ప్రారంభమయ్యాయి. కేవలం తొమ్మిది నెలల రికార్డు సమయంలోనే ఎఫ్‌టీఏ కుదరడం ఇరు దేశాల రాజకీయ సంకల్పం, వ్యూహాత్మక అవగాహనకు నిదర్శనమని మోదీ%-%లక్సన్‌లు పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను బలోపేతం చేస్తూ వాణిజ్యం, పెట్టుబడులు, సప్లై చైన్ సహకారానికి కొత్త ఊపునివ్వనుంది. రైతులు, ఎంఎస్‌ఎంఈలు, ఆవిష్కర్తలు, విద్యార్థులు, యువతకు విస్తృత అవకాశాలు అందనున్నాయి.

**భారత్‌లో కివీస్ పెట్టుబడులు**

ఎఫ్‌టీఏ అమల్లోకి వచ్చిన అనంతరం వచ్చే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. అలాగే రాబోయే 15 ఏళ్లలో న్యూజిలాండ్ భారత్‌లో 20 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. క్రీడలు, విద్య, ప్రజా సంబంధాల రంగాల్లో సాధించిన పురోగతిని కూడా నేతలు స్వాగతించారు.

**భారత్ వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తి**

ఈ సందర్భంగా ప్రధాని లక్సన్ మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని ప్రశంసించారు. ఈ ఒప్పందం కింద న్యూజిలాండ్ నుంచి భారత్‌కు ఎగుమతయ్యే 95 శాతం ఉత్పత్తులపై సుంకాలు తగ్గిస్తారని లేదా పూర్తిగా తొలగిస్తారని తెలిపారు. వచ్చే రెండు దశాబ్దాల్లో న్యూజిలాండ్ ఎగుమతులు ఏడాదికి 1.1 బిలియన్ డాలర్ల నుంచి 1.3 బిలియన్ డాలర్ల వరకు పెరిగే అవకాశముందని అంచనా వేశారు. దీని వల్ల న్యూజిలాండ్ పౌరులకు మరిన్ని ఉద్యోగాలు, మెరుగైన వేతనాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**విద్యార్థులకు గుడ్‌న్యూస్**

ఈ ఒప్పందంతో భారతీయ విద్యార్థులకు న్యూజిలాండ్ శుభవార్త తెలిపింది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ బ్యాచిలర్, మాస్టర్స్ గ్రాడ్యుయేట్లకు మూడేళ్ల వరకు, డాక్టరేట్ హోల్డర్లకు నాలుగు సంవత్సరాల వరకు పోస్ట్ స్టడీ వర్క్ వీసాలు లభించనున్నాయి. అదనంగా, నైపుణ్య వృత్తుల్లో ఉన్న 5,000 మంది భారతీయ నిపుణులు మూడేళ్ల వరకు న్యూజిలాండ్‌లో పని చేయడానికి వీలు కల్పించే కొత్త తాత్కాలిక వీసాను కూడా ప్రవేశపెట్టారు. ఇందులో ఆయుష్ ప్రాక్టీషనర్లు, యోగా బోధకులు, చెఫ్‌లు, మ్యూజిక్ టీచర్లు, ఐటీ, ఇంజినీరింగ్,

మిగితా 2వ పేజీలో

### ఒకే గొడుగు కిందకు

# రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలు

- భూభారతి పోర్టల్‌తో అనుసంధానం
- ఒక్కక్లిక్‌తో రైతులకు పూర్తి భూసమాచారం
- ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్ రూపకల్పన
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- సీసీఎల్‌ఏ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భూ పరిపాలన వ్యవస్థను మరింత పారదర్శకంగా వేగవంతంగా అందించడానికి రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తేవాలని నిర్ణయించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. భూభారతి పోర్టల్‌తో అనుసంధానం చేస్తామని వివరించారు. వచ్చే నెలలో ఆధునీకరించిన ఈ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ నాంపల్లిలోని సీసీఎల్ఏ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. భూ పరిపాలనకు కేంద్రమైన సీసీఎల్ఏ కార్యాలయం నిర్వహణ సరిగ్గా లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ఈ కార్యాలయాన్ని ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో మరోసారి కార్యాలయాన్ని తనిఖీ చేస్తాననీ, అప్పటివరకు కొంతమార్పు కనిపించాలని కోరారు. వరుసగా విభాగాల వారీగా సమీక్షించడం కూడా జరుగుతుందనీ, ఇందుకు సంబంధించి అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని చెప్పారు. దశాబ్దాల క్రితం ప్రభుత్వం వివిధ అవసరాల కోసం ప్రయివేటు వ్యక్తుల నుంచి భూ సేకరణ జరిపిందని వివరించారు. ఇప్పటికీ కొన్ని భూములు ప్రయివేటు వ్యక్తుల పేరు మీదే ఉన్నాయనీ, ఇవన్నీ కూడా రికార్డుల్లో మార్చాలని సూచించారు. అసైన్డ్, భూధాన్ భూములపై సమీక్షతోపాటు కొన్నేండ్ల నుంచి ఉద్యోగులపై విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయనీ, ఏ విభాగంలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి, కోర్టు కేసులన్నింటిపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తానని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా నిర్మించబోయే తహశీల్దార్ కార్యాలయాలు ఒకే మోడల్‌గా ఉండాలనీ, ఇందుకు సంబంధించిన డిజైన్ రూపొందించాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. ఒక్క క్లిక్‌తో రైతుకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చూడాలన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్, నాలా ఆర్డర్లు, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, ఫీడ్ బ్యాక్ వంటి పూర్తి సమాచారం లభించేలా సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలతో అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్‌ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని వివరించారు. ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావాల్సిన సమాచారం లభిస్తుందన్నారు. క్రయ, విక్రయదా రులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్‌ను రూపొందించే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. రెవెన్యూ వ్యవస్థ ఆధునీకరణ చేసే ప్రతిపనిలో సామాన్యుని కోణం ఉండాలనీ, ఎలాంటి లోపాలకు, తారుమారుకు ఆస్కారం లేకుండా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి పర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యదర్శి డిఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, సీసీఎల్ఏ ఇన్‌ఛార్జి కార్యదర్శి మంధా మకరంద్, ఎన్ఐసీ ఎస్ఐఒ ప్రసాద్, విజయ్‌మోహన్, కృష్ణ పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగులకు 17.651% డీఏ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆమోదం
- 71,387 మందికి లబ్ధి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

విద్యుత్ శాఖ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు శుభవార్త లభించింది. విద్యుత్ ఉద్యోగులకు 17.651 శాతం డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ)/డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్) ఖరారు చేస్తూ శాఖ ఉన్నతాధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆమోదం తెలిపారు. ఈ డీఏ 2025 జూలై 1 నుంచి అమల్లోకి రానుంది. బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న ధరల సూచీ ఆధారంగా ప్రతి సంవత్సరం జనవరి, జూలై నెలల్లో డీఏ/డీఆర్‌ను సమీక్షిస్తూ విడుదల చేస్తారు. ఈ క్రమంలో తాజా ఉత్తర్వులతో విద్యుత్ సంస్థల పరిధిలో ఉన్న ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డీఏ/డీఆర్‌ను 17.651 శాతంగా ఖరారు చేశారు. దీని ద్వారా మొత్తం 71,387 మంది లబ్ధి పొందనున్నారు.

**విభాగాల వారీగా లబ్ధిదారులు**

పెంచిన డీఏ ప్రకారం టీజీ ట్రాన్స్‌కోలో 3,036 మంది ఉద్యోగులు, 3,769 మంది ఆర్టిజన్లు, 2,446 మంది పెన్షనర్లు కలిపి మొత్తం 9,251 మందికి లబ్ధి చేకూరనుంది. జెన్‌కోలో 6,913 మంది ఉద్యోగులు, 3,583 మంది ఆర్టిజన్లు, 3,579 మంది పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో 11,957 మంది ఉద్యోగులు, 8,244 మంది ఆర్టిజన్లు, 8,244 మంది పెన్షనర్లకు లబ్ధి కలగనుంది. ఎన్పీడీసీఎల్లో 9,728 మంది ఉద్యోగులు, 3,465 మంది ఆర్టిజన్లు, 6,115 మంది పెన్షనర్లు డీఏ పెంపు ప్రయోజనం పొందనున్నారు.

మొత్తంగా విద్యుత్ శాఖకు చెందిన ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లు కలిపి 71,387 మందికి తాజా డీఏ పెంపు వర్తించనుంది. ఈ నిర్ణయంతో విద్యుత్ ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

# పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల

- రూ.365.84 కోట్లకు గ్రీన్ సిగ్నల్.. విద్యార్థులకు ఊరట

వివరాలు2వ పేజీలో

# 29 నుంచి తెలంగాణ అసెంబ్లీ



- డిసెంబర్ 30, 31, జనవరి 1 సెలవు..!
- మళ్లీ 2వ తేదీ నుంచి కొనసాగింపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు డిసెంబరు 29 నుంచి ప్రారంభంకానున్నాయి. డిసెంబరు 30, 31, జనవరి 1న అసెంబ్లీకి సెలవులిచ్చే అవకాశాలు ఉన్నాయి. మళ్లీ జనవరి 2వ తేదీ నుంచి సమావేశాలు కొనసాగనున్నాయి. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంత్రులతో భేటీ అయ్యారు. అసెంబ్లీ సమావేశాలు, కేసీఆర్ విమర్శలు, కృష్ణా, గోదావరి జలాల సమస్యలపై ఈ సమావేశాల్లో చర్చించనున్నారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నీటివాటాలు, కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఏపీ అక్రమ నీటి వినియోగం, అనుమతి లేకుండా చేపడుతున్న ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను శాసనసభ సమావేశాల సందర్భంగా చర్చకు పెట్టనున్నట్టు సమాచారం. నీటిపారుదల అంశాలపై గత ప్రభుత్వం అనుసరించిన విధానాలను అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నిలదీయాలని మంత్రులతో చర్చించినట్టు తెలిసింది. ఈ భేటీలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, పీఏసీఎస్ ఎన్నికలు, మున్సిపల్, జెడ్పీటీసీ ఎన్నికల్లో రిజర్వేషన్లు వంటి అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నట్టు సమాచారం. గత సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించింది. ఈ మేరకు ఆగస్టు 2025లో పంచాయతీరాజ్ చట్ట సవరణకు శాసనసభ ఆమోదం కూడా తెలిపింది. అయితే రిజర్వేషన్లు 50శాతం పరిమితి మించడాన్ని రాజ్యాంగ విరుద్ధమంటూ అక్టోబర్‌లో హైకోర్టు స్టే విధిం చింది. ఈ నేపథ్యంలో 42 శాతం రిజర్వేషన్లు లేకుండా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరప కూడదని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి 50 శాతం పరిమితిని తొలగించాలని ఒత్తిడి తెచ్చేందుకు శాసనసభలో తీర్మానాలు, పార్లమెంటులో ప్రయివేటు బిల్లులు, ఢిల్లీలో ధర్నాలు తదితర చర్యలకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నది. కాగా జనవరి 2 నుంచి జరిగే శీతాకాల సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలపై అన్ని పార్టీలు, బీసీ సంఘాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.



## సోనియా, రాహుల్ గాంధీలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పిటిషన్‌పై కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ హైకోర్టు సోమవారం నోటీసులు ఇచ్చింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రతిస్పందన తెలపాల్సిందిగా గాంధీ కుటుంబాన్ని ఆదేశించింది. ప్రధాన పిటిషన్‌తో పాటు డిసెంబర్ 16న ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే కోరుతూ ఈడీ దాఖలు చేసిన దరఖాస్తుపై జస్టిస్ రవీందర్ దుడేజా.. సోనియా, రాహుల్‌లతో పాటు ఇతరులకు నోటీసులు జారీ చేశారు. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను 2026 మార్చి 12కి వాయిదా వేశారు. ఈ కేసులో ఈడీ చార్జ్‌షీటును పరిగణలోకి తీసుకోవడం 'చట్టపరంగా ఆమోదయోగ్యం కాదు' అని, ఈడీ దర్యాప్తు ప్రయివేటు ఫిర్యాదు ఆధారంగా వచ్చిందనీ, ఎఫ్ఐఆర్ నుంచి కాదని డిసెంబర్ 16న ట్రయల్ కోర్టు ఈడీ చార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకునేందుకు నిరాకరించిన విషయం విదితమే.

# సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తం గా సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వారికి ప్రత్యేకాధికా రులు బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 11, 14, 17వ తేదీల్లో మూడు విడతల్లో నిర్వహించిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో గెలుపొందిన వారితో గ్రామాగ్రామన ప్రమాణ స్వీకారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల విజయోత్సవ సంబురాలు ఘనంగా జరిగాయి. పార్టీలకతీతంగా గ్రామాలాభివృద్ధికి కట్టుబడి ఉంటామని, ప్రజలకు జవాబుదారీగా ఉంటామని వారంతా ప్రమాణం చేశారు. ఇదే సమ యంలో కొందరు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను మొదటి రోజే అమలు చేశారు. ఉమ్మడి ఆదిలాబా ద్ జిల్లావ్యా ప్తంగా గ్రామ పంచాయతీల్లో కొత్తగా సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవాలతో పల్లెలు మురిసిపోయా యి. రెండేండ్లుగా ప్రత్యేక పాలనలో ఉన్న గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లకు ప్రత్యేకాధికారులు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ప్రమాణస్వీకారం అనంత రం బాధ్యతలు తీసుకుంటూ సర్పంచ్‌లు సంతకాలు చేశారు. దీంతో

ప్రతి గ్రామ పంచాయతీలో సందడి వాతావరణం నెలకొంది. వివిధ పార్టీల నాయకులు కొలువుదీరిన పాలకవర్గాల సభ్యులను ఘనంగా సన్మానించారు. పంచాయతీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని సర్పంచ్‌లు ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రధాన వీధుల్లో టపాసులు పేలుస్తూ డప్పులు, డీజే సౌండ్ సిస్టమ్‌లతో కేరింతలు పెడుతూ నృత్యాలు చేశారు. రోడ్‌షోలు నిర్వహించారు. కొందరు కాలినడకన ఇంటింటికీ వెళ్లి ఓటు వేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 72 మండలాల పరిధిలో 1613 గ్రామపంచాయతీలలో సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఉదయం 10 గంటల నుంచి ఆయా గ్రామాలలో గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారులు

మిగితా 2వ పేజీలో

# కమీషన్ల కోసమే కాళేశ్వరం కట్టారు



- చెక్ డ్యామ్ కూలిన ఘటనపై విచారణ
- మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నా రనీ, తెలంగాణ ప్రజలకు వారు వెంటనే క్షమాపణ చెప్పాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ

మిగితా 2వ పేజీలో

## నీటి తొట్టిలో పడి చిన్నారి మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



ఫైల్ ఫొటో

నీటి తొట్టిలో పడి చిన్నారి ప్రాణాలు కోల్పోయిన ఘటన సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివంపేట గ్రామానికి చెందిన 17 నెలల బాలుడు ఫైజల్ ఇంటి సమీపంలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడ్డాడు. బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. సుమారు రెండు గంటల తర్వాత దగ్గర్లో ఉన్న నీటి తొట్టిలో పడి ఉండటం గమనించారు. వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని బయటకి తీసి, ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు.

# 45 టీఎంసీలు చాలనడం తప్పు

- తెలంగాణ ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి
- పాలమూరు బిడ్డ అంటూ మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి
- నల్లగొండ, పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో సభలు
- ఊరూరా డప్పుకొట్టి ప్రజల్లోకి వెళ్తాం
- మాజీమంత్రి హరీశ్‌రావు





**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి 45 టీఎంసీలు చాలంటూ కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాయ డం చారిత్రక తప్పిదమని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ లేఖను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. సోమవారం హైదరా బాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి 90 టీఎంసీలకు బీఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం అటవీ, పర్యావరణ వంటి ఏడు అనుమతులను ఇచ్చిందని గుర్తు చేశారు. 90 టీఎంసీ లకు సంబంధించి 2022లో జీవో నెంబర్ 246ను జారీ చేశామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం డీపీఆర్‌ను వెనక్కి తెచ్చిందన్నారు. ఏడు నెలలవుతున్నా ప్రభుత్వం కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తేవడం లేదని ప్రశ్నించారు. ఏపీలో చంద్రబాబు, ఢిల్లీలో మోడీకి సీఎం రేవంత్‌రెడ్డి భయపడుతున్నారని అన్నారు. 90 టీఎంసీలను 45 టీఎంసీలకు తగ్గించి తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసు న్నారని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.27 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. 2014 నుంచి 2023 వరకు 17.24 లక్షల ఎకరాల భూమి కి సాగునీరు అందించామని అన్నారు. మిషన్ భగీరథ, చెక్‌డ్యామ్‌ల ద్వారా 31 లక్షల ఎకరాల భూమిని స్థిరీకరిం చామని వివరించారు. బీఆర్ఎస్ హయాం లో మొత్తం 48 ఎకరాల భూమికి నీళ్లిచ్చామని అన్నారు. 2024-25లో 6,55,895 ఎకరాలకు, 2025-26లో 5,05,000 ఎక రాలు కలిపి మొత్తం 11 వేల ఎకరాలకు నీళ్లిస్తామన్నారనీ, ఎక్కడ ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా తప్పు చెప్పానంటూ

మిగితా 2వ పేజీలో



## ఢిల్లీకి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ శీతాకాల విడిది ముగిసింది. ఈనెల 17న హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 19న రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ) చైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 21న బొల్లారంలోని రాష్ట్ర నిలయంలో ఎట్‌హోమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు రోజుల శీతాకాల విడిది ముగించుకున్న రాష్ట్రపతి, సోమవారం హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ పయన మయ్యారు. ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు వీడ్కోలు పలికారు.

# 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ

- బీఆర్ఎస్‌కు తిరిగి వెళ్లేది లేదు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో (2029) తెలంగాణ జాగృతి తప్పకుండా పోటీ చేస్తుందని ఆ సంస్థ అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. పార్టీ పేరు ఇదే ఉంటుందా లేదా అనేది ఇప్పుడే చెప్పలేమని, అయితే ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రజల తరఫున పోటీ చేయడం ఖాయమని ఆమె స్పష్టం చేశారు. ఎన్నికలతో నిమిత్తం లేకుండా ప్రజల మధ్య ఉండటం, వారి సమస్యల పరిష్కారమే తెలంగాణ జాగృతి విధానమని పేర్కొన్నారు.గద్వాల జిల్లాలో 'జనం బాట' కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో 'మన ఊరు-మన ఎంపీ' కార్యక్రమంతో ప్రజల్లో నిరంతరం ఉన్నానని గుర్తు చేశారు.

మిగితా 2వ పేజీలో

# రాచకొండలో పెరిగిన నేరాల సంఖ్య

- 78 శాతం మేర కేసులు పరిష్కారం
- పెరిగిన కిడ్నాప్, పోక్సో కేసుల సంఖ్య
- రూ. 20.01కోట్ల డ్రగ్స్ స్వాధీనం
- ఫ్రీ ఎన్‌బీడబ్ల్యూగా రాచకొండ
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- రాచకొండ నేర వార్షిక నివేదిక విడుదల



**బలగం టీవీ, హైదరాబాద్**

ఫ్రీ ఎన్‌బీడబ్ల్యూగా రాచకొండ కమిషనరేట్ ఉండడం గర్వంగా ఉందని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. రాచకొండలో ఈ ఏడాది నేరాల సంఖ్య పెరిగిందన్నారు. సోమవారం దేశంలోనే అతిపెద్ద కమిషనరేట్ రాచకొండ 2025 క్రైమ్ వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో మొత్తం 51 పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయని తెలిపారు. 2024లో 28,626 కేసులు నమోదు కాగా 2025లో 33,040 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ ఏడాదిలో 78 శాతం కేసులు క్లియర్ అయ్యాయన్నారు. నేరాల సంఖ్య పెరిగినప్పటికీ, 21,056 కేసులను పరిష్కరి ంచడం గర్వకారణమన్నారు. ముఖ్యంగా కిడ్నాప్, పోక్సో కేసులు పెరిగినట్లు సీపీ తెలిపారు. ఈ ఏడాది 579 కిడ్నాప్ కేసులు, 1,224 పోక్సో కేసులు నమోదయ్యాయని తెలిపారు. మహిళలపై నేరాలు గత ఏడాదితో పోలిస్తే 4 శాతం పెరిగినట్లు చెప్పారు. వరకట్న హత్యలు 6 కేసులు, వరకట్న మరణాలు 12 కేసులు, ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులు 52, వేధింపులు-గహహింస కేసులు 782, మహిళల హత్యలు 18, లైంగికదాడులు 330 కేసులు నమోదైనట్లు వెల్లడించారు. 12 కీలక కేసుల్లో దోషులకు 20 ఏండ్ల జైలు శిక్ష పడేలా పటిష్ట దర్యాప్తు నిర్వహించామని తెలిపారు.

రాష్ట్రంలో ఈ ఏడాది జీవిత ఖైదు శిక్ష పడిన 31 కేసులు రాచకొండ కమిషనరేట్ పరిధిలోనే నమోదవ్వడం విశేషమన్నారు. ఇందులో అడ్డగూడూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక హత్య కేసులో 17 మందికి శిక్ష పడినట్టు చెప్పారు.డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం మోపామని, ఈ ఏడాది రూ.20.01 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుని 495 మందిని అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు. ఇందులో తెలంగాణకు చెందిన 322 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన 172 మంది, ఒక విదేశీయుడు ఉన్నట్టు వెల్లడించారు. అలాగే 227 ఎన్డీపీఎస్ అనుమానిత షీట్లను తెరిచామని చెప్పారు. సైబర్ నేరాల విషయంలో 3,734 కేసులు నమోదు కాగా, రూ.40.10 కోట్ల నగదును రికవరీ చేసినట్లు తెలిపారు. మొత్తం 6,188 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశామన్నారు. ఈ ఏడాది ఎక్సైజ్ యాక్ట్ కింద 656 కేసులు నమోదు చేయగా 689 మంది అరెస్ట్ చేశామన్నారు. కాగా 6,824 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది గేమింగ్ యాక్ట్ కింద 227 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ కేసుల్లో 1,472 మంది అరెస్ట్ కాగా.. రూ. 69 లక్షల ప్రాపర్టీ సీజ్ చేసినట్టు చెప్పారు. అలాగే మర్డర్ ఫర్ గెయిన్ 3, దోపిడీ 3, దొంగతనాలు 67, ఇండ్లలో చోరీ 589 , వాహనాల చోరీ 876, సాధారణ చోరీలు 1,161, హత్యలు 73, లైంగికదాడులు 330, వరకట్నం మరణాలు 12, గృహ హింస కింద 782 కేసులు నమోదయినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్, మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి డీసీపీలు, ట్రాఫిక్ డీసీపీలు, ఎస్‌ఓటీ అడిషనల్ డీసీపీ, అడిషనల్ డీసీపీలు పాల్గొన్నారు.

# కమీషన్ల కోసమే కాళేశ్వరం కట్టారు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ. 27 వేల కోట్లు ఖర్చు పెట్టారనీ, అయినా 90 శాతం పనులు కూడా ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. రూ.5 వేల కోట్ల బిల్లులు ఇంకా చెల్లించలేదని ఆరోపించారు. 45 టీఎంసీల లేఖ కొత్తది కాదనీ, 17 జనవరి 2024 ఫిబ్రవరిలో కేఆర్‌ఎంబీకి ఇచ్చామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న దానినే లేఖలో ప్రస్తావించామని చెప్పారు. 90 టీఎంసీలను గతంలో కేసీఆరే డివైడ్ చేసి 45 టీఎంసీలుగా మార్చారని గుర్తు చేశారు. కృష్ణా జలాల విషయంలో 2014 నుంచి 2020 వరకు జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ సంతకాలు పెట్టారని ఉత్తమ్ అన్నారు. కృష్ణా నీటి వాటాలో 71 శాతం తెలంగాణకు, 29శాతం ఏపీకి ఇవ్వాలని పోరాడుతున్నామని స్పష్టం చేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌లో ఏపీతో కుమ్మక్కై రోజుకు 3 టీఎంసీలు అప్పగించారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులు ఆపించామన్నారు. నల్లగొండ జిల్లాకు అన్యాయం చేసేందుకు కేసీఆర్ డిండికి అనుమతి ఇవ్వలేదనీ, మంత్రి కోమటిరెడి వెంకటరెడ్డిపై కోపంతో బ్రహ్మనవెల్లి ప్రాజెక్టుపై కుట్ర చేశారని విమర్శించారు. పదేండ్ల పాలనలో పాలమూరు, డిండి, ఎస్-ఎల్‌బీసీ ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ప్రాజెక్టుకు కనీసం ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్ కూడా తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలోనే పాలమూరుకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. అలాగే కాళేశ్వరం విషయంలోనూ బీఆర్ఎస్ పదే పదే తప్పుడు ప్రచారాలు చేస్తోందని అన్నారు. తెలంగాణ ప్రజల తలను తాకట్టు పెట్టి కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించారు. గత ఐదేండ్లలో 70 టీఎంసీల నీళ్లను మాత్రమే ఆ ప్రాజెక్ట్ నుంచి ఉపయోగించారన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీర్చడానికి ఏడాదికి రూ.20 వేల కోట్లు చెల్లిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలను కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ నేతలు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. హరీశ్‌రావు పేరు మార్చుకుని గోబెల్స్ అని పెట్టుకోవాలని సూచించారు.

# 45 టీఎంసీలు చాలనడం తప్పు

(మొదటి పేజీ తరువాయి)

క్షమాపణ చెప్పాలని కోరారు. ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌లను కూల్చివేస్తు_న్న అసలైన ఉగ్రవా ది రేవంత్‌రెడ్డి అని ఆరోపిం చారు. ఎస్ఎల్‌బీసీ కుప్పకూలితే శవాలను బయటకు తీయలేని చాతగాని ప్రభుత్వమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నీటి ప్రయోజనాలు పట్టడం లేదన్నారు. ఈ ద్రోహాన్ని వదిలిపెట్ట బోమని చెప్పారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో ఊరూరా డప్పు కొట్టి ప్రజల్లోకి వెళ్తామన్నారు. ఆయా జిల్లాల్లో సభలు నిర్వహిస్తామని అన్నారు. 90 టీఎంసీల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రయోజనాలు, తెలంగాణ భవిష్యత్తు గురించి హుందాగా మాట్లాడితే, సీఎం హరీశ్‌రావు తీవ్రంగా విమర్శించారు. ఇటీవల కేసీఆర్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తెలంగాణ హక్కులు, హైదరాబాద్ శ్రేయస్సు, రాష్ట్రానికి నష్టం కలగకుండా చూడాల్సిన బాధ్యతపై ఒక స్టేట్స్‌మన్‌లా మాట్లాడారని హరీశ్‌రావు అన్నారు. "తెలంగాణకు ఒక నొక్కు పడనీయను" అన్న కేసీఆర్ మాటలతో సీఎం, మంత్రులకు ఎందుకు నొప్పి వచ్చిందో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ఇప్పటికీ ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతున్నదని విమర్శించారు. ముఖ్యంగా ఆసరా పింఛన్లను రూ.4 వేల వరకు బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అద్భుత ఆర్థిక ప్రగతి సాధించిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తక్కువ కాలంలోనే జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణ దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొన్న జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు కూడా కేసీఆర్ పాలనలోని ఆర్థిక వృద్ధిని ప్రశంసించారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్ల పాలనలో చేసిన పని ఏమిటంటే చెక్‌డ్యామ్‌ల పేల్చివేత, ప్రాజెక్టుల కూల్చివేత మాత్రమేనని హరీశ్‌రావు ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా 11 లక్షల 60 వేల ఎకరాలకు నీళ్లు ఇస్తామని చెప్పారని, కనీసం 11 వేల ఎకరాలకు అయినా నీళ్లు ఇచ్చారా..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో 17 లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు ఇచ్చామని, 31 లక్షల ఎకరాలను స్థిరీకరించామని చెప్పారు. 11 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిన ఆధారాలు చూపాలని, లేదంటే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# కో లివింగ్ హాస్టల్లో డ్రగ్స్...

**బలగం టీవీ, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధి అంజయ్యనగర్‌లోని కో లివింగ్ హాస్టల్లో డ్రగ్స్ దందా మరోసారి వెలుగు చూసింది. కో లివ్ గెర్నట్ పీజీలో ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం డ్రగ్స్ పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కో లివింగ్ హాస్టల్‌లో డ్రగ్స్ ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే హాస్టల్‌పై దాడి చేశారు. ఏపీకి చెందిన వంశీ దిలీప్, బాల ప్రకాశ్.. బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. వీరు హైదరాబాద్‌కు చెందిన రోహిత్, తరుణ్‌కు విక్రయించారు. ఈ క్రమంలో డ్రగ్స్ దందా సాగుతున్నట్టు ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు హాస్టల్‌పై దాడి చేసి మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 12 గ్రాముల ఎండీఎంఏ, 7 గ్రాముల ఓజీ కుష్, 6 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. న్యూ ఈయర్ వేడుకల నేపథ్యంలో డ్రగ్స్ సరఫరా చేస్తున్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### భారత్-న్యూజిలాండ్ మధ్య

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య, నిర్మాణ రంగాల నిపుణులు ఉన్నారు. ఇటీవల కాలంలో భారత్ యూఏఈ, యూకే, ఆస్ట్రేలియా, మారిషస్ వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటూ ముందుకుసాగుతోంది. ఈ క్రమంలో భారత్ విశ్వసనీయమైన ప్రపంచ వాణిజ్య కేంద్రంగా వేగంగా ఎదుగుతోందని ఆర్థిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల

- రూ.365.84 కోట్లకు గ్రీన్ సిగ్నల్.. విద్యార్థులకు ఊరట

**బలగం టీవీ, హైదరాబాద్**

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖలకు సంబంధించిన పెండింగ్ బకాయిల్లో భాగంగా మొత్తం రూ.365.84 కోట్లను సోమవారం విడుదల చేసినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. విభాగాల వారీగా చూస్తే బీసీ సంక్షేమశాఖకు రూ.21.62 కోట్లు, ఎస్సీ సంక్షేమశాఖకు రూ.191.63 కోట్లు, గిరిజన (ఎస్టీ) సంక్షేమశాఖకు రూ.152.59 కోట్లను ప్రభుత్వం విడుదల చేసినట్లు ఆయన వివరించారు. ఈ నిధులతో వేలాది మంది విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లింపులు జరగనున్నాయి. ఇంతకుముందు డిప్యూటీ సీఎం ప్రజాభవన్‌లో ఆర్థిక, సంక్షేమశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్కాలర్‌షిప్ బకాయిల పరిస్థితి, నిధుల విడుదల ప్రక్రియపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఊరట నెలకొంది. ఇకపై స్కాలర్‌షిప్ చెల్లింపుల్లో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# సర్పంచ్‌లు, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

నూతన పాలకవర్గం చేత ప్రమాణ స్వీకారాలు చేయించారు. కొమురంభీం జిల్లా వాంకిడిలో సర్పంచ్ మరికొంతమంది వార్డు సభ్యులు గైర్హాజర య్యారు. ఉపసర్పంచ్, మరికొందరు వార్డు సభ్యులు ప్రమాణం చేశారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుమెంబర్లు ప్రమాణస్వీకారం చేశారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని రామలక్ష్మణపల్లి గ్రామంలో 80 ఏండ్ల వృద్ధురాలు షేక్ చోటిబి వార్డు మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై.. సోమవారం ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని అమ్రాద్ గ్రామంలో నూతన పంచాయతీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే నూతన గ్రామ పంచాయతీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మోర్తాడ్ మండలం గాండ్లపేట్ గ్రామ సర్పంచ్ సుభాష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మ్యాని ఫెస్టోను ప్రమాణస్వీకారం రోజే అమలు చేశాడు. గ్రామంలో ఆడపిల్ల పుడితే ఆ కుటుం బానికి రూ.5116 అందిస్తానని హామీనిచ్చాడు. సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజే గ్రామంలో ఆడపిల్ల పుట్టడంతో ఆ కుటుంబానికి సర్పంచ్ సుభాష్ రూ.5116 అందజేశారు. తాను సర్పంచ్‌గా ఉన్నన్ని రోజులు ఇచ్చిన హామీని అమలు చేస్తానని తెలిపారు.

# 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ జాగృతి పోటీ

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ నేతలు ఎంపీ ఎన్నికల్లో కుట్ర చేసి తనను ఓడించారని, ఆ తర్వాత ఎంపీ ఇస్తామని చెప్పి ఎమ్మెల్సీ చేశారని, చివరికి పార్టీ నుంచే బహిష్కరించారని ఆరోపించారు. ఈ పరిణామాలతో తన హృదయం ముక్కలైందని, ఇక మళ్లీ బీఆర్ఎస్ వైపు వెళ్లేది లేదని స్పష్టం చేశారు.

ఒకనాడు 'విద్వత్ గద్వాల'గా పేరొందిన ఈ ప్రాంతానికి గొప్ప చారిత్రక, సాంస్కృతిక, సాహితీ వైభవం ఉందని కవిత పేర్కొన్నారు. దేశంలో అక్షరాస్యత 80.09 శాతం ఉండగా, తెలంగాణలో అది 77.9 శాతానికి పడిపోయిందని, గ్రామీణ తెలంగాణలో 69.9 శాతం మాత్రమే ఉందని తెలిపారు. మహిళల అక్షరాస్యత 65.9 శాతానికి పరిమితమై, గత ఏడాది నుంచి 4 శాతం తగ్గిందని విమర్శించారు. ఇది 'తెలంగాణ రైజింగ్'నా లేక 'ఫాలింగ్'నా అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. గద్వాల జిల్లాలో మొత్తం అక్షరాస్యత 49.8 శాతం మాత్రమే ఉండగా, మహిళల అక్షరాస్యత 39.4 శాతానికి పరిమితమైందని తెలిపారు. కేటిదొడ్డి మండలంలో ఇది 33.77 శాతం మాత్రమేనని పేర్కొంటూ, దీనిపై డీకే అరుణ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నా సరే, జిల్లా ఆసుపత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఆర్డీఎస్, జూరాల ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పునరుద్ధరించాలని, నెట్టెంపాడు ప్రాజెక్టు, గట్టు ఎత్తిపోతలను పూర్తి చేయాలని, రోలంపాడు రిజర్వాయర్ ముంపు బాధితులను ఆదుకోవాలని కవిత డిమాండ్ చేశారు. గురుకులాలకు మూడేళ్లుగా అద్దెలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అని చెప్పుకునే సీఎం తన సొంత మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా వాటిపై దృష్టి పెట్టడం లేదని, ఆయన దృష్టి మొత్తం కరప్షన్, డైవర్షన్‌పైనే ఉందని ఆరోపించారు. ఎన్నికల హామీల విషయంలో పాత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ మాట తప్పాయని కవిత విమర్శించారు. ఆరు గ్యారంటీలపై ప్రశ్నించే వారే కరువయ్యారని అన్నారు. తెలంగాణ జాగృతి జిల్లాల వారీగా ప్రజా సమస్యలను గుర్తించి, పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని ఆమె స్పష్టం చేశారు.

# గ్రామపంచాయతీలో అవినీతికి అడ్డుకట్టపడేనా ?

- **నూతన సర్పంచ్ ల పైన**

**గ్రామాల ప్రజల ఆశలు**

**బలగం టీవీ, బోయినిపల్లి**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని 23 గ్రామాలలో గత రెండేళ్లుగా సర్పంచులు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో పాటు పంచాయతీల్లో అవినీతి ఎక్కువ అయింది. దీంతో గ్రామాలలో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురై, ఎవరికి చెప్పుకోలేని స్థితిలో ఉన్నారు. గ్రామాలలో ప్రత్యేక అధికారులుగా నియామకమైన అధికారులు వారి వారి శాఖలలో పని భారం కూడా ఎక్కువ ఉండడంతో గ్రామపంచాయతీలను పట్టించుకోకపోవడంతో గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లు ఇష్టాను సారంగా అవినీతికి పాల్పడ్డ సంఘటనలు చాలానే ఉన్నాయి. దీనికి తోడు కార్యదర్శులు, మల్టీ పర్పస్ వర్కర్లపై ఆధారపడడం, పని భారం కార్యదర్శులు తగ్గించుకోవడంతో మల్టీపర్పస్ వర్కర్లు ప్రతి దాంట్లో అవినీతికి పాల్పడుతూ అందిన కాడికి దండుకున్నట్టు గుసగుసలు వినపడ్డాయి. మల్టీపర్పస్ వర్కర్లపై ఆధారపడడంతో కొన్ని గ్రామాలలో ప్రజలకు కార్యదర్శి తెలవకపోవడం గమనార్హం. నూతన సర్పంచులు గ్రామపంచాయతీలలో జరిగే అవినీతికి అడ్డుకట్ట వేసి, గ్రామ ప్రజలకు చేరువవుతూ గ్రామ సమస్యల పరిష్కారంలో ముందుండాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కులు అందజేసిన కేసీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్**

ఉప్పల్ నియోజకవర్గంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మెడికల్ విద్యార్థులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అండగా నిలిచారు. నియోజకవర్గ పరిధిలోని 15 మంది ఎంబీబీఎస్ విద్యార్థుల వైద్య విద్యకు అయ్యే ఫీజును ఆదివారం నంది నగర్‌లోని నివాసంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) చేతుల మీదుగా ఈ చెక్కులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేస్తున్న ఈ కృషిని అభినందించారు. వైద్యం లాంటి ఉన్నత విద్యను అభ్యసించే క్రమంలో ఆర్థిక కారణాలతో ఏ విద్యార్థి చదువు ఆగిపోకూడదని ఆయన ఆకాంక్షించారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తన నియోజకవర్గ విద్యార్థులు డాక్టర్లుగా మారి సమాజానికి సేవ చేయాలన్నదే తన లక్ష్యమని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని తమకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# మండేపల్లిలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి

**బలగం టీవీ రాజన్న సిరిసిల్ల:**



శ్రీనివాస రామానుజన్ భారతదేశానికి గర్వకారణమైన మహా గణిత శాస్త్రవేత్త. 1887 డిసెంబర్ 22న తమిళనాడులోని ఈరోడ్ పట్టణంలో జన్మించారు. తండ్రి కుప్పుస్వామి, తల్లి కోమలతమ్మాళ్ బాల్యంలోనే రామానుజన్ కి గణితంపై అసాధారణమైన ఆసక్తి మరియు ప్రతిభ కనిపించేది. రామానుజన్ పాఠశాల విద్యలో గణితంలో ఎంతో ప్రతిభ చూపారు. అయితే ఇతర విషయాలపై ఆసక్తి లేకపోవడంతో చదువులో ఆటంకాలు ఎదురయ్యాయి. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, స్వీయ కృషితో గణితాన్ని లోతుగా అధ్యయనం చేశారు. పుస్తకాలు లేకపోయినా, స్వంత ఆలోచనలతో అనేక సూత్రాలు కనుగొన్నారు. తాను ప్రతిభను గుర్తించిన ఆంగ్ల గణిత శాస్త్రవేత్త జి. హెచ్. హార్డీ రామానుజన్‌ను ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి ఆహ్వానించారు. అక్కడ ఆయన సంఖ్యల సిద్ధాంతం, అనంత శ్రేణులు, విభజన సిద్ధాంతం వంటి రంగాల్లో విలువైన పరిశోధనలు చేశారు. రామానుజన్ చేసిన ఆవిష్కరణలు ప్రపంచవ్యాప్తంగా గణిత శాస్త్రానికి గొప్ప మార్గదర్శకంగా నిలిచాయి. రామానుజన్ తక్కువ వయసులోనే అనేక విజయాలు సాధించారు. ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీగా ఎంపికయ్యారు. ఆరోగ్య సమస్యల కారణంగా తాను 1920లో, కేవలం 32 ఏళ్ల వయసులోనే కన్నుమూశారు. అయినప్పటికీ, తాను చేసిన కృషి గణిత ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచింది.

శ్రీనివాస రామానుజన్ జీవితం కష్టపడి నేర్చుకుంటే ఏ ఎత్తుకైనా ఎదగవచ్చని చూపిస్తుంది. ఆయన జ్ఞాపకార్థంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 22న గణిత దినోత్సవంను జరుపుకుంటారు. రామానుజన్ భారత దేశ యువతకు ఎప్పటికీ ప్రేరణగా నిలుస్తారు.గణితం మన దైనందిన జీవితంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. సమయం తెలుసుకోవడం, డబ్బు లెక్కలు వేయడం, కొలతలు చేయడం వంటి పనుల్లో గణితం అవసరం. విజ్ఞానం, సాంకేతికత, వైద్య శాస్త్రం, కంప్యూటర్ రంగం, అంతరిక్ష పరిశోధనలలో కూడా గణితానికి ప్రత్యేక స్థానం ఉంది. గణితం లేకుండా ఆధునిక ప్రపంచాన్ని ఊహించలేం. గణిత శాస్త్రం మనలో తార్కిక ఆలోచనను, విశ్లేషణ సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది. సమస్యలను క్రమబద్ధంగా పరిష్కరించే నైపుణ్యాన్ని గణితం నేర్పుతుంది. గణితం చదవడం వల్ల క్రమశిక్షణ, సహనం, ఖచ్చితత్వం అలవడతాయి. విద్యార్థులు గణితాన్ని భయపడకుండా ఆసక్తితో నేర్చుకోవాలి. శ్రీనివాస రామానుజన్ సాధారణ కుటుంబంలో జన్మించి, స్వీయ కృషితో ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్తగా ఎదిగారు. సంఖ్యల సిద్ధాంతం, అనంత శ్రేణులు వంటి రంగాల్లో ఆయన చేసిన పరిశోధనలు గణిత ప్రపంచానికి గొప్ప వరం. ఆయన జీవితం విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుంది. గణిత దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో వ్యాసరచన, ప్రసంగాలు, క్విజ్ పోటీలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇవి విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంచడంలో సహాయపడతాయి. గణితం కేవలం పరీక్షలకే కాదు, జీవితానికి కూడా ఎంతో అవసరమని ఈ దినోత్సవం గుర్తు చేస్తుంది. గణిత దినోత్సవం గణిత శాస్త్ర విలువను తెలియజేసే ముఖ్యమైన రోజు అని సర్పంచ్ గాధగోని సాగర్ తన కీర్తిని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు భోజనం ఏ విధంగా ఉందో తెలుసుకుని సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మండేపల్లి సర్పంచ్ గాధగోని సాగర్, ఉపసర్పంచ్ యాస సందీప్, వార్డ్ మెంబర్స్ అమరగొండ ప్రభుదాస్, కొమ్మెట మల్లేశం, తిమ్మానగరం దేవదాస్, సింగం శశి కుమార్, యాస శ్రీవాణి, బోడపట్ల రాకేష్, యాస మధు, గ్రామ కార్యదర్శి ముదం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రుత్విక్ సాయి.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ఏఎస్పీ)గా రుత్విక్ సాయి ఐపీఎస్ సోమవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ గితే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన బిజెపి నాయకులు

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల బిజెపి నాయకులు ఆదివారం రోజున కేంద్ర హోంశాఖ మంత్రి వర్యులు బండి సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మిల్కుల శ్రీనివాస్, గుడి రవీందర్ రెడ్డి కట్ట విజయ్, ఎడపల్లి శ్రీను, సింగరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండువగా అయ్యప్ప స్వామి పడి పూజ

**బలగం టీవీ, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన జోగినిపల్లి వెంకటేశ్వర్ రావు-నీరజ దంపతుల గృహంలో జిందం సుకుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడి పూజ ఆదివారం రోజున కన్నుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి దీక్ష స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. గణపతి నవగ్రహ, సుబ్రమణ్య స్వామి, గౌరి పూజ, అనంతరం అయ్యప్ప స్వామి పంచామృత అభిషేకం నిర్వహించారు. గురుస్వామి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం చేశారు. అనంతరం తీర్థ ప్రసాదము అందించారు.

# సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో ఇటీవల రెండవ సాధారణ సర్పంచ్ ఎన్నికలు జరగగా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి మర్లపేట గ్రామ సర్పంచ్ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బోయినిపల్లి సర్పంచ్ నల్లమోహన్, తడగొండ సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కొడగానీ వెంకటేష్ (రత్నంపేట), సహాయ కార్యదర్శిగా కట్ట గోవర్ధన్ (మానువాడ), కోశాధికారి జంగం అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా కొప్పుల లావణ్య, సుద్దాల మధు, ఇల్లందుల రాజేశం, చింతలపల్లి కవిత, ఇరువాలా సంధ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# రాబోయే ఎన్నికల్లో ముదిరాజ్ లు సత్తా చాటాలి..

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాబోయే ఎన్నికల్లో ముదిరాజ్ లు ఐక్యత తో ఉండి,ముదిరాజ్ ల సత్తా చాటాలని ముదిరాజ్ సంఘం నాయకులు పిట్టల రమేష్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద నూతనంగా ఎన్నికైన సర్పంచ్ నల్లమోహన్ తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో గెలుపొందిన ముదిరాజ్ కులస్తులు వార్డు సభ్యులు గెలవడంతో,మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ నల్ల మోహన్ మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులమందరం ఐక్యతతో ఉండి మరిన్ని పదవులు చేపట్టాలని కోరారు.అనంతరం పిట్టల రమేష్ మాట్లాడుతూ.. రాబోయే జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులు సత్తా చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మండల అధ్యక్షులు పండుగ రమేష్, నాయకులు రెడ్డవేణి రాజు,బొజ్జ శేఖర్, రాజనర్సు,రమేష్,తిప్పరవేణి కనకయ్య, పిట్టల రమేష్,బొజ్జ ప్రభాకర్,సంఘ సభ్యులు ఉన్నారు.



# మహిళా క్రికెట్‌కు సువర్ణదశ

- **దేశవాళీ టోర్నీల్లో మ్యాచ్ ఫీజులు రెట్టింపు..**
- **సీనియర్లకు రోజుకు రూ.50వేలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశంలో మహిళా క్రికెట్‌కు సువర్ణ దశ ప్రారంభం కానుంది. స్వదేశం వేదికగా ఇటీవల ప్రతిష్టాత్మక వన్డే ప్రపంచకప్ టోర్నీలో భారత్ టైటిల్ విజేతగా నిలిచిన నేపథ్యంలో మహిళా క్రికెట్‌కు మరింత ప్రోత్సాహం ఇచ్చేందుకు బీసీసీఐ సిద్ధమైంది. మహిళల దేశవాళీ టోర్నీలకు పెద్దపీట వేయాలని నిర్ణయించిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాల ప్రకారం, ఇకపై దేశవాళీ టోర్నీల్లో పాల్గొనే సీనియర్ మహిళా క్రికెటర్లు రోజుకు రూ.50వేల మ్యాచ్ ఫీజు పొందనున్నారు. గతంలో ఉన్న రూ.20వేలతో పోలిస్తే ఇది రెండింతలు కావడం గమనార్హం. తుది జట్టులోని ప్లేయర్లకు పూర్తి మొత్తంలో రూ.50వేలు అందుతుండగా, రిజర్వ్ ప్లేయర్లకు రూ.25వేలు లభించనున్నాయి.

జాతీయ టీ20 టోర్నీలో ఫైనల్ లెవన్‌లో చోటు దక్కించుకున్న ప్లేయర్లకు మ్యాచ్ ఫీజుగా రూ.25వేలు చెల్లించనుండగా, రిజర్వ్ ప్లేయర్లకు రూ.12,500లు ఇవ్వనున్నారు. అన్ని ఫార్మాట్లలో జరిగే దేశవాళీ టోర్నీ సీజన్ మొత్తాన్ని ఆడితే ఒక్కో ప్లేయర్‌కు రూ.12 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా. మరోవైపు అండర్-19, అండర్-23 టోర్నీల్లో పాల్గొనే మహిళా ప్లేయర్లకు రోజుకు రూ.25వేలు, రిజర్వ్ ప్లేయర్లకు రూ.12,500లు చెల్లించనున్నారు. అలాగే కొత్త స్కీమ్ ప్రకారం మ్యాచ్ అంపైర్లు, రిఫరీలకు రోజుకు రూ.40వేలు లభించనుండగా, కీలక మ్యాచ్‌లకు ఇది రూ.50వేల నుంచి రూ.60వేల వరకు ఉండనుంది. దీని ద్వారా రంజీ ట్రోఫీలో ఒక మ్యాచ్‌కు దాదాపు రూ.1.60 లక్షలు, నాకౌట్ మ్యాచ్‌లకు రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు అందే అవకాశముంది. ఈ నిర్ణయాలతో దేశంలో మహిళా క్రికెట్‌కు మరింత ఊపు వచ్చే అవకాశముందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి.




# దృశ్యం-3 హిందీ రిలీజ్ డేట్ ఫిక్స్

- **2026 అక్టోబర్ 2న అజయ్ దేవ్‌గన్ వెర్షన్ విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్**

మాలీవుడ్‌లో తెరకెక్కి పలు భాషల్లో విడుదలై 'టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ'గా నిలిచిన క్రైమ్ థ్రిల్లర్ ప్రాంఛైజీ దృశ్యం మరోసారి వార్తల్లో నిలిచింది. మలయాళంలో రూపొందిన ఈ చిత్రానికి జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించగా, మోహన్‌లాల్, మీనా ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ ప్రాంఛైజీలో మూడో భాగమైన దృశ్యం-3 కూడా తెరకెక్కుతోందన్న విషయం తెలిసిందే. ఇప్పటికే మలయాళ ఒరిజినల్ వెర్షన్ షఉటింగ్ పూర్తయ్యింది. మలయాళ వెర్షన్ రిలీజ్‌పై ఇంకా స్పష్టత రాకముందే, హిందీ వెర్షన్‌కు సంబంధించి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. అజయ్ దేవ్‌గన్, శ్రియా శరణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న లిలిదృశ్యం-3 (హిందీ)లిలిని 2026 అక్టోబర్ 2న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం హిందీ వెర్షన్ షఉటింగ్ కొనసాగుతోంది. ఈ చిత్రంలో టబు, రజత్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అభిషేక్ పాఠక్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్టార్ స్టూడియోస్ సమర్పణలో పనోరమ స్టూడియోస్ నిర్మిస్తోంది. ఇక మలయాళ ఒరిజినల్ దృశ్యం3 థియేట్రికల్, డిజిటల్ రైట్స్ కలిపి ఏకంగా రూ.350 కోట్ల వరకు పలికినట్లు మాలీవుడ్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. జార్జ్‌కుట్టీ (మోహన్‌లాల్) కుటుంబం చుట్టూ తిరిగే కథతో తెరకెక్కిన ఈ ప్రాంఛైజీలో ఇప్పటికే వచ్చిన తొలి రెండు భాగాలు బ్లాక్‌బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. తొలి భాగం థియేటర్లలో విడుదలవగా, రెండో భాగం ఓటీటీలో విడుదలైంది. మూడో భాగాన్ని ఆశీర్వాద్ సినిమాస్ నిర్మిస్తోంది.

దృశ్యం కథ తెలుగు, తమిళం, హిందీతో పాటు ఇతర భాషల ప్రేక్షకులను కూడా బలంగా ఆకట్టుకుంది. ఇప్పటికే తెలుగులో వెంకటేశ్ నటించిన వెర్షన్‌తో పాటు హిందీ, తమిళం, కన్నడ భాషల్లో రీమేక్ అయి సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు మూడో భాగంతో మరోసారి ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేయనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## బిగ్‌బాస్ 9 విజేత కళ్యాణ్ పడాల

**బలగం టీవీ, హైదరాబాద్**

బిగ్‌బాస్ తెలుగు 9 సీజన్‌కు ఘనంగా ముగింపు పలికారు. ముందునుంచి వినిపిస్తున్న అంచనాలు, సోషల్ మీడియాలో సాగిన ప్రచారం, ఓటింగ్ ట్రెండ్స్ అన్నీ నిజమయ్యాయి. కామన్ మ్యాన్‌గా హౌస్‌లో అడుగుపెట్టిన కళ్యాణ్ పడాల ఈ సీజన్ విన్నర్‌గా నిలిచారు. ఆదివారం సాయంత్రం జరిగిన గ్రాండ్ ఫినాలేలో హోస్ట్ నాగార్జున ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.




# ప్రపంచకప్‌కు ముందు న్యూజిలాండ్‌తో కీలక పోరు

**బలగం టీవీ, హైదరాబాద్**





సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌ను గెలుచుకున్న భారత జట్టు ఈ ఏడాదిని విజయవంతంగా ముగించింది. వచ్చే ఏడాది ఆరంభంలో స్వదేశంలో న్యూజిలాండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌లలో తలపడనుంది. ముఖ్యంగా ఐసీసీ టీ20 ప్రపంచకప్%--%2026కు ముందు ఇదే చివరి టీ20 సిరీస్ కావడంతో ఈ పోరాటాలపై క్రికెట్ అభిమానుల్లో సర్వత్రా ఆసక్తి నెలకొంది.సౌతాఫ్రికా సిరీస్ అనంతరం భారత ఆటగాళ్లకు సుమారు 20 రోజుల విశ్రాంతి లభించింది. ప్రస్తుతం ఆటగాళ్లంతా స్వస్థలాలకు చేరుకున్నారు. కొందరు విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొననుండగా, మరికొందరు విశ్రాంతి తీసుకోనున్నారు.

**మూడు వన్డేల సిరీస్**

జనవరి 11 నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మళ్లీ బరిలోకి దిగనున్నారు.

జనవరి 11న వడోదర వేదికగా తొలి వన్డే, జనవరి 14న రాజ్‌కోట్‌లో రెండో వన్డే, జనవరి 18న ఇండోర్‌లో మూడో వన్డే జరగనుంది. అన్ని మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రారంబమవుతాయి. వన్డే సిరీస్‌కు సంబంధించిన జట్టును ఇంకా ప్రకటించలేదు.

**ఐదు టీ20ల సిరీస్**

న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్ జనవరి 21 నుంచి మొదలవుతుంది.

జనవరి 21న నాగ్‌పూర్‌లో తొలి టీ20, జనవరి 23న రాయ్‌పూర్‌లో రెండో టీ20, జనవరి 25న గువహతిలో మూడో టీ20, జనవరి 28న విశాఖపట్నంలో నాలుగో టీ20, జనవరి 31న తిరువనంతపురంలో ఐదో టీ20 జరగనుంది. ప్రపంచకప్‌కు ముందు చివరి టీ20 సిరీస్ కావడంతో ఈ మ్యాచ్‌లు కీలకంగా మారాయి.

**భారత టీ20 జట్టు**

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, రింకూ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి.

# రాష్ట్రపతిని కలిసిన హాస్య బ్రహ్మ

- **ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఘన సత్కారం**
- **రాష్ట్రపతికి ఆంజనేయ స్వామి పెన్సిల్ ఆర్ట్ చిత్రం అందజేత**



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలుగు సినీ పరిశ్రమలో హాస్యానికి చిరునామాగా నిలిచిన హాస్య బ్రహ్మ బ్రహ్మానందం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో జరిగిన ఈ భేటీ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి బ్రహ్మానందాన్ని ఆప్యాయంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛం అందించి, శాలువతో ఘనంగా సత్కరించారు.

ప్రతిగా బ్రహ్మానందం తాను స్వయంగా గీసిన ఆంజనేయ స్వామి పెన్సిల్ ఆర్ట్ చిత్రాన్ని రాష్ట్రపతికి బహుకరించారు. ఈ ప్రత్యేకమైన బహుమతి రాష్ట్రపతిని ఎంతగానో ఆకట్టుకున్నట్లు సమాచారం. ఈ భేటీ వెనుక ఉన్న కారణాన్ని అధికారికంగా వెల్లడించనప్పటికీ, ఇద్దరూ కొంతసేపు ఆత్మీయంగా ముచ్చటించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతూ వైరల్‌గా మారాయి.

సినీ రంగంలోనే కాదు, వ్యక్తిగత జీవితంలోనూ బ్రహ్మానందం ప్రత్యేక గుర్తింపును సంపాదించారు. ఆయన కేవలం గొప్ప హాస్య నటుడే కాకుండా, అద్భుతమైన చిత్రకారుడిగా కూడా పేరుగాంచారు. ముఖ్యంగా పెన్సిల్ ఆర్ట్‌లో దేవుళ్ల చిత్రాలను అద్భుతంగా గీయడం ఆయన ప్రత్యేకత. ఖాళీ సమయాల్లో చిత్రలేఖనం చేయడం ఆయనకు ఎంతో ఇష్టం. తనను కలిసే ప్రముఖులకు తాను గీసిన చిత్రాలను బహుమతిగా అందించడం ఆయన అలవాటు. ఈ క్రమంలో కృష?ంరాజు నుంచి రామ్ చరణ్ వరకు పలువురు ప్రముఖులకు ఆయన గీసిన చిత్రాలు అందించారు.

వయోభారంతో సినిమాల సంఖ్య తగ్గించినప్పటికీ, అప్పుడప్పుడు ప్రత్యేక పాత్రల్లో కనిపిస్తూ ప్రేక్షకులను నవ్విస్తూనే ఉన్నారు. తాజాగా విడుదలైన గుర్రం పాపిరెడ్డి చిత్రంలో ఆయన నటనకు మరోసారి ప్రశంసలు లభించాయి. రాష్ట్రపతితో భేటీ అయిన ఈ సంఘటన బ్రహ్మానందం వ్యక్తిత్వానికి మరో గౌరవ ఘట్టంగా సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## ఏఐతో అనిల్ రావిపూడి ప్రమోషన్

**బలగం టీవీ, హైదరాబాద్**



సినిమా ప్రమోషన్ల విషయంలో దర్శకుడు అనిల్ రావిపూడి అనుసరిస్తున్న స్టైల్ పూర్తిగా భిన్నంగా ఉంటోంది. కొత్త ఐడియాలతో సినిమాలను విడుదలకు ముందే ట్రెండింగ్‌లో ఉంచడంలో ఆయనకు ఆయనే సాటి. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవితో తెరకెక్కిస్తున్న 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రానికి కూడా అదే ఫార్ములాను ఫాలో అవుతూ వరుసగా క్రియేటివ్ ప్రమోషనల్ వీడియోలను విడుదల చేస్తున్నారు. సినిమా అనౌన్స్‌మెంట్ దగ్గర నుంచే ప్రతి అంశాన్ని ప్రమోషన్‌గా మార్చి వైరల్ చేయడంలో అనిల్ మరోసారి తన మార్క్ చూపిస్తున్నారు. లేటెస్ట్‌గా ఆయన ఏఐ టెక్నాలజీని వినియోగించి రూపొందించిన ప్రత్యేక వీడియో నెట్టింట వైరల్‌గా మారింది."అలా నేను చూస్తూ పెరిగిన మెగాస్టార్ నుంచి ఇలా నేను డైరెక్ట్ చేసే మెగాస్టార్ వరకు" అనే క్యాప్షన్‌తో అనిల్ షేర్ చేసిన ఈ వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ వీడియోలో చిరంజీవి కెరీర్‌లోని క్లాసిక్ చిత్రాలైన ఖైదీ, గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు, జగదేకవీరుడు అతిలోకసుందరి, ముఠామేస్త్రీ, అంజి, ఇంద్ర, శంకర్‌దాదా ఎంబీబీఎస్, ఠాగూర్ వంటి సినిమాల సెట్స్‌కు అనిల్ వెళ్లినట్టుగా ఏఐ ద్వారా విజువల్స్‌ను రూపొందించారు. మెగాస్టార్‌తో కలిసి ఉన్నట్టుగా చూపిస్తూ తన అభిమానాన్ని వినూత్నంగా ఆవిష్కరించారు. మెగాస్టార్‌తో తెరకెక్కిస్తున్న 'మన శంకరవరప్రసాద్‌గారు' జనవరి 12న భారీ స్థాయిలో విడుదల కానుంది. అలాగే వెంకటేష్ (వెంకీ మామ) తొలిసారి చిరంజీవితో కలిసి గెస్ట్ రోల్‌లో కనిపించనుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.



## 'నారి నారి నడుమ మురారి' టీజర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

శర్వానంద్ నటిస్తున్న తాజా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ లిలినారి నారి నడుమ మురారిలిలి టీజర్‌ను సోమవారం చిత్ర బృందం విడుదల చేసింది. సంయుక్త మీనన్, సాక్షి వైద్య కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న సాయంత్రం 5.49 గంటలకు ఫస్ట్ షోతో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా విడుదలైన టీజర్ పూర్తి వినోదాత్మకంగా సాగింది. ప్రేమించిన అమ్మాయితో పెళ్లి ఖరారైన సమయంలో అనుకోకుండా హీరో జీవితంలోకి మాజీ ప్రియురాలు ఎంటరవడం, దాంతో కథ మలుపులు తిరగడం, ఇద్దరు అమ్మాయిల మధ్య చిక్కుకొని కథానాయకుడు ఉక్కిరిబిక్కిరి కావడం వంటి అంశాలు హాస్యభరితంగా చూపించారు.